క్లుప్తంగా

అర్హులందరికీ పథకాలు అందించాలి



వలంటీర్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి

నందికొట్కూరు రూరల్ : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు గ్రామ వలంటీర్లు కృషి చేయాలని మండల ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని ఎంపీపీ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన నాగటూరు గ్రామానికి చెందిన వేణమ్మ అనే మహిళా వలంటీర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు పబ్బతి రవి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓగా తిమ్మారెడ్డి బాధ్యతల స్వీకరణ



జూపాడుబంగ్లా: ఉపాధ్యాయులు సకాలంలో విధులకు హాజరై అంకితభావంతో విద్యార్థులకు విద్యాబోధన చేయాలని ఎంఈఓ తిమ్మారెడ్డి తెలిపారు. సోమవారం నూతన ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను కోయిలకుంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తూ బదిలీల్లో భాగంగా జూపాడుబంగ్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా వచ్చినట్లు తెలిపారు. గతంలో ఉన్న హెచ్‌ఎం మోహన్ బదిలీపై అనంతపురం జిల్లా హిందూపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లారు. జూపాడుబంగ్లాకు రెగ్యులర్ ఎంఈఓ లేనందున ఉన్నత పాఠశాల హెచ్‌ఎంకు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

పగిడ్యాల: మండలంలోని 8 గ్రామ పంచాయతీల పరిధిలో గల గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని మండల ఈఓఆర్డీ బీ.ఎల్. నాగేంద్రయ్య అన్నారు. సోమవారం పగిడ్యాల మండల ఈఓఆర్డీగా బాధ్యతలు చేపట్టిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాధారణ బదిలీల్లో భాగంగా చాగలమర్రి మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చినట్లు తెలిపారు.

పొదుపు రుణాలపై ఆరా

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలంలో శ్రీనిధి ఉన్నతి రుణాలను తీసుకొని తిరిగి చెల్లించని పొదుపు సంఘాల ఖాతాలపై అధికారులు సోమవారం ఆరాతీశారు. రుణాల చెల్లింపుల్లో వీఏఓలు, కొందరు గ్రామైక్య సంఘాలు అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించారు. రుణాలు పొందిన ప్రతిగ్రూపు తిరిగి చెల్లించాలని అధికారులు గ్రామైక్య సంఘాలను కోరారు. రుణాల ఖాతాలపై ఏరియా కోఆర్డినేటర్ పుల్లయ్య, శ్రీనిధి మేనేజర్ మధుకుమార్, ఎల్ఎస్ పుల్లయ్య, ఎపిఎం శివచెన్నరాయుడు ఆరాతీశారు.

లూజు విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్

వెలుగోడు: లూజ్ విత్తనాలు అమ్మిన వారిపై పీడీ ఆక్ట్ కింద నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లు ఏఓ పవన్ కుమార్ తెలిపారు. సోమవారం పట్టణంలోని విజయలక్ష్మి సీడ్స్ దుకాణాన్ని తనిఖీ చేశారు. షాపులో రికార్డులు పరిశీలించి, స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుంతకందాల, వేల్పనూరు పీహెచ్‌సీలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది యాసిర్, వెంకట శివ, స్నేహ తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వరానికి భక్తుల తాకిడి



కృష్ణానదిలో భక్తుల పుణ్యస్నానాలు

కొత్తపల్లి: మండలంలోని సప్తనదుల సంగమేశ్వరానికి భక్తుల, సందర్శకుల తాకిడి ఎక్కువైంది. సోమవారం సుదూర ప్రాంతాల నుంచి భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి సంగమేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో పూజించుకున్నారు. విజయవాడ డివిజన్ మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ సతీమణి శిరీష, కుమారు ధీమంత్ సంగమేశ్వరాలయాన్ని సందర్శించారు. వారికి ఆలయ పురోహితులు సంప్రదాయానుసారాం స్వాగతం పలికారు. అనంతరం వేపదారు శివలింగానికి కృష్ణాజలాలతో అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి వంటి విశేషపూజలు చేయించారు.

రోడ్డు ప్రమాదంలో సహకార సొసైటీ డైరెక్టర్ మృతి

నందికొట్కూరు: స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘం డైరెక్టర్ షేక్ చాంద్‌బాషా సోమవారం పట్టణంలోని జీవన్ జ్యోతి స్కూల్ వద్ద బైక్ అదుపు తప్పి కిందపడటంతో మృతి చెందారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతదేహాన్ని ఎమ్మెల్యే సందర్శించి నివాళులర్పించారు. మృతున్ని కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు.

నాడు-నేడు.. మారిన సర్కారు బడులు

- విద్యకు పెద్ద పీట వేసిన జగనన్న ప్రభుత్వం
- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి
- నియోజకవర్గంలో రెండో విడత నాడు-నేడు పనులు దాదాపు పూర్తి
- మొదటి రోజే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక



నందికొట్కూరు మండలంలోని 10 బొల్లవరం ప్రాథమిక పాఠశాల



నందికొట్కూరు పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్



పాములపాడు మండలంలోని మిట్టకందాల ఎంపీపీ స్కూల్‌లోని మరుగుదొడ్డి

నందికొట్కూరు: గత పాలకుల పాలనలో ప్రభుత్వ పాఠశాలలలో వసతులు, సౌకర్యాలు, సమస్యలు ఉండేవి. మరుగుదొడ్లు కూడా సరిగా ఉండేవి కావు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధన్యత ఇచ్చి నాడు-నేడు పథకం ద్వారా కోట్లాది రూపాయలు వెచ్చించారు. ఫలితంగా దశాబ్దాలుగా నిరాదరణకు గురైన సర్కారు బడులు నేడు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చెందాయి. సకల వసతులు, సౌకర్యాలు కల్పించడంతో గ్రామస్తుల ఆదరణ లభిస్తోంది. గ్రామంలో పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపుతున్నారు. విద్యార్థుల హాజరు శాతం పెరగడంతోపాటు మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

నాడు-నేడుతో పాఠశాలల అభివృద్ధి

నియోజకవర్గంలో మొదటి దశ నాడు-నేడు కింద వంద శాతం పనులు పూర్తి చేశారు. ఈ పథకం కింద పాఠశాలలకు తరగతి గదులు, మరుగుదొడ్లు, పాఠశాలల మరమ్మతులు, విద్యుద్దీకరణ, ఇంగ్లిషు మీడియం, తాగునీరు, ట్యాబ్, ఫర్నీచర్, గ్రీన్‌బోర్డు, పాఠశాలల రంగులు సమకూరాయి. ఫేజ్-1 నియోజకవర్గంలో స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌టీలను ప్రభుత్వం కేటాయించింది. రెండో దశ పనులు 80 నుంచి 85 శాతం పూర్తయ్యాయి.

తొలిరోజే విద్యాకానుకల పంపిణీ

నందికొట్కూరు నియోజకవర్గంలో 257 పాఠశాలలుండగా 32,785 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వారందరికీ జగనన్న విద్యాకానుకలో భాగంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బెల్టులు, బ్యాగులు, డిష్నరీలు, బూట్లు తదితర సామగ్రి కూడిన కిట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. పాఠశాలలు తెరచిన మొదటిరోజే వీటిని విద్యార్థులకు అందజేశారు.

బాలికల కళాశాల ఏర్పాటు

2022-23 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను మంజూరు చేయగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలతో అనుబంధంగా దీనిని ఏర్పాటు చేశారు.

నందికొట్కూరు నియోజకవర్గంలో	
మొత్తం పాఠశాలలు	257
మొత్తం విద్యార్థులు	32,785

నాడు-నేడు మొదటి దశ

ఖర్చు చేసిన నిధులు - రూ. 18.03 కోట్ల	
మొత్తం పాఠశాలలు	-121
ప్రాథమిక పాఠశాలలు	-80
ప్రాథమికోన్నత పాఠశాలలు	-17
జిల్లా పరిషత్ పాఠశాలలు	-14
కస్తూరిబా	-04
ఏపీ మోడల్ స్కూల్స్	-03
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాలు	-02

రెండో దశలో

ఖర్చు చేసిన నిధులు - రూ.46. 56 కోట్లు	
మొత్తం పాఠశాలలు	-138
ప్రాథమిక పాఠశాలలు	-95
ప్రాథమికోన్నత పాఠశాలలు	-16
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు	-32
గవర్నమెంట్ కళాశాలలు	-03
అంగన్‌వాడీ కేంద్రాలు	-18
కస్తూరిబా	-03
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం	-01
ఏపీ మోడల్ స్కూల్	-01

ప్రభుత్వ పాఠశాలలో చదువులు బాగున్నాయి



మాది చాలా పేద కుటుంబం. పిల్లలను ప్రైవేట్ పాఠశాల లకు పంపించాలంటే స్థోమత లేదు. గతంలో ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలంటే సౌకర్యాలు ఉండేవి కావు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వచ్చాక ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటు గా సౌకర్యాలు, వసతులు కల్పించారు. మాకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కూతురు నందిని కొత్తపల్లి జెడ్పీ హైస్కూల్‌లో, చిన్న కూతురు స్నేహ 5వ తరగతి ప్రైవేట్ స్కూల్‌కు పంపేవాళ్లం. జగనన్న ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందడంతో చిన్న కూతురిని కూడా 6వ తరగతిలో జెడ్పీ హైస్కూల్‌లో చేర్పిస్తాను. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి మాలాంటి మధ్యతరగతి కుటుంబాలను ఆదుకుంది.

– కదిరి సునీత. వీరాపురం గ్రామం, కొత్తపల్లి మండలం

మెరుగైన విద్యా విధానం



నా కూతురు 9వ తరగతి కస్తూరిబాలో చదువుతోంది. ప్రభుత్వం నాడు-నేడు కింద పిల్లలకు కావాల్సిన సౌకర్యాలు కల్పించింది. గత ప్రభుత్వంలో సరైనా సౌకర్యాలు లేవు. జగనన్న ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సదుపాయలు ప్రభుత్వం కల్పించింది. అందుకే చాలా మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలలోనే చేరుతున్నారు.

– నాగరాజు, పగిడ్యాల

చాలా అభివృద్ధి జరిగింది

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన విద్యావిధానం నవశకానికి నాంది పలికింది. ఉపాధ్యాయులు కూడా ఆంగ్ల మాధ్యమంపై ప్రత్యేక శ్రద్ధ పెడితే ప్రభుత్వ పాఠశాలలల్లో మరింత మెరుగ్గా ఫలితాలు వస్తాయి. నందికొట్కూరు మండలంలో 60 పాఠశాలలకు గాను 32 పాఠశాలలు నాడు-నేడు కింద పనులు పూర్తయ్యాయి.

– ఫైజున్నీసాబేగం, ఎంఈఓ. నందికొట్కూరు మండలం

సచివాలయంలోనే రిజిస్ట్రేషన్



రిజిస్ట్రేషన్ పత్రాన్ని అందుకుంటున్న సర్పంచు నిత్యలక్ష్మీదేవి

కొత్తపల్లి: గ్రామాలలో ఇళ్లు, స్థలాలు, పొలాలు వంటి దేనికైనా గ్రామ సచివాలయంలోనే రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని సర్పంచు నిత్యలక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. మండలంలోని నందికుంట గ్రామ సచివాలయంలో మొట్టమొదటిగా మార్ట్‌గేజ్ డాక్యుమెంటేషన్ ప్రక్రియను సోమవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నందికుంట గ్రామ సచివాలయం పరిధిలో అన్ని భూములు, ఇళ్లు, దేవాలయాలు, చర్చిలు, మసీదులకు స్వమిత్ర పథకం కింద భూ రిసర్వే పూర్తిచేశామన్నారు. వాటికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ సచివాలయంలో ప్రారంభమైందని చెప్పారు. ఇందులో భాగంగానే మొదటగా సర్పంచు నిత్యలక్ష్మీదేవి ఇంటికి సంబంధించిన డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకోవాలి

కొత్తపల్లి: గ్రామాలలో ప్రజలు సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలని ఆత్మకూరు సీఐ ఆర్.జీ. సుబ్రహ్మణ్యం సూచించారు. సోమవారం శివపురం కొలనుభారతమ్మ ఆర్చీ నిర్మాణ సమస్య స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు అన్నదమ్ములవలే కలసిమెలసి గ్రామాల అభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. కక్షలకు పోయి ఇబ్బందులు కొని తెచ్చుకోకూడదన్నారు. కొలనుభారతి దేవి ఆల యానికి వెళ్లే దారిలో ఆర్చీ నిర్మాణంలో ఇరువర్గాల మధ్య సమస్య నెలకొందన్నారు. ఆ స్థలాన్ని పరిశీలించి ఇరువర్గాలతో చర్చించామన్నారు. సమస్య ను పరిష్కారం చూపించామని, ఆర్చీ నిర్మాణం చేసుకోవచ్చని తెలిపారు. ఎస్ఐ హుస్సేన్ బాషా ఉన్నారు.

వలంటీర్ల సేవలు అద్భుతం



బండిఆత్మకూరు మండల వలంటీర్లను సన్మానించిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

- సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం
- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు సన్మానం

మహానంది: వలంటీర్ల సేవలు అద్భుతమని, సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో సోమవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. బండిఆత్మకూరు మండలం పార్నపల్లెలోని టీటీడీ కల్యాణ మండపం, మహానందిలోని శాలివాహన అన్నసత్ర మండపంలో ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు అవార్డులు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఎలాంటి వివక్ష లేకుండా కేవలం అర్హత ప్రామాణికంగా పథకాలు అందిస్తూ పేదల మనసుల్లో నిలిచిన జగన్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్న వలంటీర్లు సైనికుల్లా పనిచేస్తున్నారన్నారు.

అరటిరైతులను ఆదుకుంటాం

ఈదురుగాలులకు నష్టపోయిన అరటిరైతులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హామీ ఇచ్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, వ్యవసాయ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డితో మాట్లాడి నష్టపోయిన ప్రతి రైతులకు పరిహారం అందేలా తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమాల్లో మహానంది, బండిఆత్మకూరు ఎంపీపీలు బుడ్డారెడ్డి యశస్విని, దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు కొమ్మా మహేశ్వరరెడ్డి, బారెడ్డి శ్రీనివాసరెడ్డి, పార్నపల్లె సర్పంచ్ షేక్ షబ్బీర్ అహ్మద్, తహసీల్దార్ జనార్దన్‌శెట్టి, మాజీ ఎంపీపీ దేసు వెంకట్రామిరెడ్డి, ఉపసర్పంచ్ రామలింగేశ్వరరెడ్డి, సొసైటీ చైర్మన్ శివలింగం తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకున్న బడి తలుపులు

జూపాడుబంగ్లా: వివిధ గ్రామాల్లోని పాఠశాలల తలుపులు సోమవారం తెరచి బడిగంట మోగించటంతో విద్యార్థులు ఆటలు, పాటలను అటకెక్కించి పుస్తకాల బ్యాగు భుజాలకు తగిలించుకొని బడి బాట పట్టారు. కనకయ్యకొట్టాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తూడిచెర్ల సర్పంచ్ బాలమద్దిలేటి, ఉపసర్పంచ్ చెన్నారెడ్డి, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు గనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు.

మోగిన బడి గంట

పాములపాడు: వేసవి సెలవులు ముగిశాయి. సోమవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. బదిలీల పై మండలానికి వచ్చిన ఉపాధ్యాయులు బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం చెప్పిన ప్రకారం పాఠశాల ప్రారంభం రోజునే హాజరైన విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు. మిట్టకందాల గ్రామంలో సర్పంచు చింతల నారయణ విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు.

పాఠశాలల్లో పండుగ వాతావరణం

పగిడ్యాల: బడి గంట మోగి పిల్లలను పిలచడంతో సోమవారం బడి తలుపులు యథాతథంగా తెరుచుకున్నాయి. 2023-24 విద్యా సంవత్సరం ప్రారంభం మొదటి రోజునే పిల్లలకు విద్యా కానుక కిట్లు చేతికి అందడంతో ఆనందంలో మునిగారు. ఉపాధ్యాయులు పాఠశాలల ముంగిట ముత్యాల ముగ్గులు తీర్చి వాకిళ్లకు మామిడి తోరణాలు కట్టి పిల్లలకు ఆహ్లాదకరమైన పండుగ వాతావరణాన్ని కలిగించి స్వాగతం పలికారు. పగిడ్యాల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటింటికి తిరిగి పిల్లలను తమ పాఠశాలలో చేర్పించాలని ప్రచారం నిర్వహించారు. నెహ్రూనగర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు సురేష్ పిల్లలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన విద్యా కానుక లైవ్ కార్యక్రమాన్ని సెల్‌ఫోన్‌లో తిలకించే ఏర్పాట్లు చేయడం విశేషం. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న గోరు ముద్దను ఎంఈఓ సుభాన్ పరిశీలించారు.

ప్రైవేటు స్కూళ్లకు దీటుగా..

ఆత్మకూరు: ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుపాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ఆసియా మారుఫ్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఉర్దూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ వరాల మాలిక్, హెచ్‌ఎం ఆయుబ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కానుకల పంపిణీ

మిడుతూరు: నాగలూటి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గ్రామ సర్పంచ్ ఉషారాణి, పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీచేశారు. మండల ఉపాధ్యక్షుడు నబిరసూల్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్లారెడ్డి, పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: కోట జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం సలీంబాషా విద్యార్థులకు విద్యా కానుక కిట్లను అందజేశారు.



ఆత్మకూరులో విద్యాకానుక కిట్లను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆసియా మారుఫ్



నెహ్రూనగర్‌లో ఉపాధ్యాయులకు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని కొణిదేల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎం హనుమంతరావు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ శ్రీరాములు, సభ్యులు కొంగర అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

మహానంది: గాజులపల్లెలో సర్పంచ్ గద్దం చంటి, ఎంపీటీసీ చౌటుపల్లి నరసింహులు ఆధ్వర్యంలో విద్యార్థులకు కిట్లను అందజేశారు. తిమ్మాపురంలో సర్పంచ్ కల్లె శ్రీలక్ష్మీ, గోపవరంలో జడ్పీ హెచ్‌ఎం భాస్కర్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

ఉపాధి పనులు కల్పించండి

జూపాడుబంగ్లా: తాటిపాడు గ్రామంలో వెంటనే ఉపాధి పనులు కల్పించి ఆదుకోవాలని గ్రామ ప్రజలు సోమవారం స్పందన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో నెల రోజుల నుంచి ఉపాధి పనుల్లేక తీవ్ర ఇబ్బందులకు గురవున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తుండగా, తమ గ్రామంలో ఎందుకు పనులు చూపడంలేదని ప్రశ్నించారు. ఈ విషయమై పక్కనే ఉన్న ఏపీఓ గౌరీబాయిని ప్రశ్నించగా గ్రామపంచాయతీ తీర్మానం ఇవ్వనందున గ్రామంలో ఉపాధి పనులు కల్పించలేకపోతున్నామని తెలిపారు. దీంతో ఎంపీడీఓ పంచాయతీ కార్యదర్శి శాంతయ్యకు ఫోన్‌చేసి వెంటనే గ్రామసభను నిర్వహించి తీర్మానాలు చేసి పంపాలని ఆదేశించారు.

అక్రమ మట్టి తవ్వకంపై పరిశీలన



అక్రమంగా మట్టిని తవ్విన వంకలో కొలతలు వేస్తున్న ఇరిగేషన్ అధికారులు

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామ పొలిమేరలోని కేసీ కెనాల్ 111వ కిలోమీటరు వద్ద సైడ్ బండ్‌ను అక్రమంగా తవ్విన ప్రాంతాన్ని డీఈ రఘునాథరెడ్డి సోమవారం పరిశీలించారు. ఎల్లమ్మ వంకగా పిలువబడే కాల్వను, సైడ్ బండ్‌ను జూటూరు గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి అనే వ్యక్తి వారం రోజుల క్రితం అక్రమంగా తవ్వినట్లు ఫిర్యాదు రావడంతో పరిశీలిస్తున్నామని చెప్పారు. ఆ ప్రాంతంలో కొలతలు వేసి మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించినది కాదని, కేసీ కెనాల్‌కు సంబంధించినదిగా తేల్చారు. మట్టిని అక్రమంగా తవ్వి రామకృష్ణారెడ్డి తన పొలం సర్వేనెంబర్లు 895ఎ, 895బీ, 895సీలలో తరలించాడన్నారు. 2 మీటర్ల వెడల్పు, 2.5 మీటర్ల లోతు, 100 మీటర్ల పొడవులో 500 క్యూబిక్‌మీటర్ల మట్టిని తవ్వినట్లు తెలిపారు. అక్రమంగా మట్టి తవ్విన రైతు పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. ఆయన వెంట ఏఈలు శ్రీనివాసనాయక్, నరేష్, సిబ్బంది ఉన్నారు.

చర్చికి రూ.20 వేలు విరాళం



చర్చి సంఘ పెద్దలకు నగదు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

మిడుతూరు: మండలపరిధిలోని చెరుకుచెర్ల గ్రామంలో సీఎస్ఐ చర్చి ప్రతిష్ఠ కోసం ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి రూ. 20 వేలు విరాళం అందజేసినట్లు నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి తెలిపారు. సోమవారం చెరుకుచెర్ల గ్రామంలోని సీఎస్ఐ చర్చిలో సంఘపెద్దలకు నగదును నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ సుధాకర్ రెడ్డి అందజేశారు. ఆయన మాట్లాడుతూ చెరుకుచెర్ల గ్రామంలో సీఎస్ఐ చర్చి ప్రతిష్ఠ కార్యక్రమానికి విరాళాన్ని అందజేయాల్సిందిగా సంఘపెద్దలు, గ్రామ వెస్సార్‌సీపీ నాయకుల ద్వారా ఏపీ శాప్ చైర్మన్ కోరడంతో స్పందించిన శాప్ చైర్మన్ రూ. 20 వేలు మొత్తాన్ని అందించాలని ఆదేశించారన్నారు. శాప్ చైర్మన్‌కు సీఎస్ఐ చర్చి సంఘ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పేరెడ్డి నారాయణరెడ్డి, పేరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గుండం పుల్లారెడ్డి, దాసి కృష్ణారెడ్డి, కాతా అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

ఆత్మకూరు: ప్రజా సమస్యలపై పోరాటలకు ప్రజలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని సుదర్శన వర్మ భవనంలో సీపీఎం పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో మేధావులపై, ప్రజాతంత్ర వాదుల పై, మైనార్టీ, దళితులపై దాడులు పెరిగాయన్నారు. సమావేశంలో మంజుల, సురేంద్ర, స్వాములు, సద్దాం హుసేన్ పాల్గొన్నారు.

వికలాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచాలి

వెలుగోడు: ప్రభుత్వం ఇచ్చే వికలాంగుల పింఛన్‌ను రూ.6వేలకు పెంచాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్‌రవూఫ్, నాయకులు ఇంతియాజ్ కోరారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పుష్పలత, లక్ష్మయ్య, మన్సూర్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

బేగరుల సమస్యలు పరిష్కరించాలి

వెలుగోడు: శ్మశానంలో గుంతలు తీసే బేగరుల సమస్యలు పరిష్కరించాలని కేవీపీఎస్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దారు సత్య శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.రామదాస్ మాట్లాడుతూ.. బేగరులకు ఐడీ కార్డులు ఇచ్చి, ఐదువేల రూపాయలు పెన్షన్ మంజూరు చేసి, జీవిత బీమా సౌకర్యం కల్పించాలన్నారు. సీఐటీయూ మండల అధ్యక్షులు నాగమోహన్, బేగరులు బాలరాజు, చిన్ని కృష్ణ, కేశాలు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అడ్మిషన్లపై చర్యలు తీసుకోండి

నందికొట్కూరు: ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు ముందస్తు అక్రమ అడ్మిషన్లు చేయడం ఎంత వరకు సమంజసమని పీడీఎస్‌యూ డివిజన్ ప్రధాన కార్యదర్శి మద్దిస్వామి ప్రశ్నించారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ భవనంలో ఏర్పాటు చేసిన పీడీఎస్‌యూ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ప్రణయ్, మస్తాన్, వాసు, లెనిన్ పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లకు సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల భక్తులు పల్లకిసేవలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. స్వామి,అమ్మ వార్లను విశేషంగా అలంకరించి ఉత్సవం కనులపండువగా చేశారు.

మహానంది డీటీ బదిలీ

మహానంది: మహానందిలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న నారాయణ రెడ్డిని బదిలీ చేస్తూ సోమవారం ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆయనను వెలుగోడు డీటీగా బదిలీ చేస్తూ తహసీల్దార్‌గా ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.